సాక్షి
అనంతపురం
శుక్రవారం । 6 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేల ధర పలికాయి.



కిలో టమాట రూ.7

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.2.50 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.



జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. ఫలితంగా చలి తీవ్రత అధికమైంది.

న్యూస్‌రీల్

విద్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దిలో ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలను గురువారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న విద్యా కానుక సక్రమంగా అందిందా? మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉందా? చిక్కీలు, కోడిగుడ్లు సక్రమంగా అందిస్తున్నారా? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాడు– నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం పిల్లల హాజరును హెచ్‌ఎం శ్రీనివాసులతో అడిగి తెలుసుకున్నారు.

8న గ్రూప్‌–1 పరీక్ష

- అభ్యర్థుల కోసం కంట్రోల్ రూమ్
- కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్‌–1 సర్వీసెస్ పరీక్షలను 8న నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం శుక్రవారం నుంచి 8 వరకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఏదైనా సమాచారం కోరేందుకు లేకపోతే ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్ 8500292992 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓగా వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా వీరబ్బాయిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంపచోడవరంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా వ్యవహరిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికార వర్గాలు వెల్లడించాయి.

గృహ నిర్మాణ సంస్థ ఈఈగా సత్యనారాయణ

అననంతపురం టౌన్: గృహ నిర్మాణ సంస్థ అనంతపురం ఈఈ వెంకటదాసును నెల్లూరు జిల్లా ఈఈగా బదిలీ చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి ఈఈగా పని చేస్తున్న సత్యనారాయణను అనంతపురం ఈఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఈఈ వెంకటదాసు రిలీవ్ అయ్యారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకట కృష్ణా రెడ్డి

అనంతపురం: సీబీఎస్‌ఈ అమలయ్యే పాఠశాలల్లో ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆర్జేడీ ఎం. వెంకట కృష్ణా రెడ్డి అన్నారు. సీబీఎస్‌ఈ అమలుకు ఎంపికై న ప్రధానోపాధ్యాయులకు గురువారం రాప్తాడు మోడల్ స్కూల్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతపురం జిల్లాలో 51, శ్రీ సత్యసాయి జిల్లాలో 49 సీబీఎస్‌ఈ పాఠశాలలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. సీబీఎస్‌ఈ విధానంలో ఉన్న పాఠశాలల్లో పాలన వేరుగా ఉంటుందని అందుకు తగ్గట్టుగా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ పెంపొందించడానికి మొత్తం ఆరుగుర రిసోర్స్ పర్సన్‌లను ఎస్‌సీఈఆర్టీ పంపిందన్నారు. సీబీఎస్‌ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం గర్వకారణమన్నారు. అడ్మిషన్లు ఎలా నిర్వహించాలి? బోధన, అభ్యసన తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ తిలక్ విద్యాసాగర్, డీసీఈబీ సెక్రెటరీ లోకేశ్వర రెడ్డి, ఏఎంఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ బాబూ

ఎన్నికల్లో ఓటమి తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ముఖ్యమైన నాయకులు సైతం కనిపించకుండా పోయారు. కరోనా విపత్కర పరిస్థితులు మొదలు ప్రజలకు సంబంధించి ఏ కష్టంలోనూ వారు పాలుపంచుకోలేదు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇప్పుడిప్పుడే వారికి జనంపై ప్రేమ ఉప్పొంగిపోతోంది. పార్టీ అధిష్టానం కూడా 'ఇదేం ఖర్మ' నిర్వహించాలని చెప్పడంతో ప్రజల ముందు ప్రత్యక్ష మవుతున్నారు. కానీ, ఆ కార్యక్రమమే ఇప్పుడు టీడీపీలో కుమ్ములాటలకు ఆజ్యం పోస్తోంది. ఏ నాయకుడికి మద్దతు ఇవ్వాలో తెలీక 'మాకిదేం ఖర్మ బాబూ' అని ఆ పార్టీ కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు.

- ఒక్కో నియోజకవర్గంలో రెండు, మూడు గ్రూపులు
- అగ్నికి ఆజ్యం పోస్తున్న 'ఇదేం ఖర్మ'
- రోడ్లపైనే టీడీపీ నాయకుల బాహాబాహీ
- సందిగ్ధంలో ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు



వెంకటాపురంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న బండారు శ్రావణి వర్గీయులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ నాయకులు రోడ్డెక్కడంతో ఆ పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలకు దిక్కుతోచడం లేదు. ఏ నియోజకవర్గంలో చూసినా నాలుగైదు వర్గాలు కామన్ అయిపోయాయి. తాజాగా ఆ పార్టీ అధిష్టానం పిలుపిచ్చిన 'ఇదేంఖర్మ' కార్యక్రమం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. దీంతో ఆ పార్టీ కేడర్‌లో నిస్తేజం నెలకొంది.

తారస్థాయికి విభేదాలు

- శింగనమల నియోజకవర్గంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. నియోజకవర్గంలో ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి... బండారు శ్రావణికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. నరసనాయుడు, ముంటిమడుగు వర్గాలు కార్యక్రమం చేయడానికి రావడంతో శ్రావణి వర్గం వారిని అడ్డుకుంది. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. రోడ్డుమీదనే తెలుగుతమ్ముళ్లు కొట్టుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.
- పెనుకొండలో సవితమ్మ, పార్థసారథి, నిమ్మల కిష్టప్ప వర్గాలు తలోమార్గంలో వెళ్తున్నాయి. ఒకరి పేరెత్తితే మరొకరు భగ్గుమంటున్న పరిస్థితి. దీంతో కార్యక్రమం చేస్తే ఎటు వెళ్లాలో కూడా కార్యకర్తలు తేల్చుకోలేకపోతున్నారు.
- కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి, మహేశ్వరనాయుడు వర్గాల మధ్య పాము ముంగిస వైరంలా మారింది. ఏకంగా వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు నడుపుతుండటంతో టీడీపీ కేడర్ రెండుగా చీలింది.
- అనంతపురం అర్బన్‌లో ప్రభాకర్‌చౌదరికి వ్యతిరేకంగా చాలా మంది నాయకులు పావులు కదుపుతున్నారు. ప్రభాకర్‌చౌదరికి ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ రాకుండా చేయాలని యత్నిస్తున్నారు. అదే స్థాయిలో ఆయన కూడా రాజకీయం చేస్తున్నారు.
- మడకశిరలో గుండుమల తిప్పేస్వామి, ఈరన్న వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. ఏ కార్యక్రమం చేసినా విడివిడిగా చేస్తూ ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలని యత్నిస్తూ ఉన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నిసార్లు చెప్పినా మేమింతే అన్న రీతిలో వారు ముందుకెళ్తున్నారు.
- పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి చెక్ పెట్టేలా సైకం శ్రీనివాసరెడ్డి, పెద్దరాసు సుబ్రహ్మణ్యం జోరుగా తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పల్లెకు టికెట్ ఇస్తే అసలు తాము పనేచేయమంటూ మరికొందరు నాయకులు తిరుగుబాటు చేస్తుండటంతో పార్టీ కేడర్ సందిగ్ధంలో పడిపోయింది.
- కదిరిలో అత్తార్ చాంద్‌బాషా, కందికుంట ప్రసాద్ వర్గాలు ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నాయి. ఇప్పటికే అనేకసార్లు ఇరు వర్గాలు బాహాబహీకి దిగిన విషయం తెలిసిందే. కార్యక్రమాలన్నీ విడివిడిగా చేస్తుండటం ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది.
- గుంతకల్లు టీడీపీ నాలుగు వర్గాలుగా విడిపోయింది. జితేంద్రగౌడ్, వెంకటశివుడు యాదవ్, పత్తి హిమబిందు, జీవానందరెడ్డి టికెట్ కోసం జోరుగా యత్నిస్తున్నారు. పార్టీ కేడర్ కూడా నాయకుల వారీగా విడిపోవడంతో అధిష్టానానికి ఏం చేయాలో కూడా దిక్కుతోచడం లేదు.
- ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌కు ప్రస్తుతం బీజేపీలో ఉన్న వరదాపురం సూరి చెక్ పెడతారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. వారిద్దరి మధ్య తరచూ జరుగుతున్న మాటల యుద్ధం దీన్ని బలపరుస్తోంది.

వెంటాడుతున్న ఈడీ, సీబీఐ కేసులు

టీడీపీ హయాంలో చేసిన అవినీతి, అక్రమాలు ఆ పార్టీ నాయకులకు నిద్రపట్టనివ్వకుండా చేస్తున్నాయి. ఇప్పటికే తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఈడీ, సీబీఐ కేసులు మెడకు ఉచ్చులా తగులుకున్నాయి. బీఎస్‌–3 వాహనాలను బీఎస్‌– 4గా మార్చి అమ్మిన కేసులో ఇప్పటికే చార్జిషీట్లు దాఖలయ్యాయి. ధర్మవరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన వరదాపురం సూరిపై భూఆక్రమణ కేసుల్లో సీఐడీ విచారణ జరుగుతోంది. దీనికితోడు తాజాగా కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ రవాణా చేస్తూ దొరికిపోవడంతో కేసు నమోదు చేశారు. మరోవైపు అక్రమాస్తుల కేసులో పెనుకొండకు చెందిన సవితమ్మ ఇంట్లో ఇటీవలే సీబీఐ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అనుభవించి ఇప్పుడు కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి జ్వాలలు రోజూ ఎక్కడో చోట రగులుతూనే ఉన్నాయి.

పురం,దుర్గంలో స్థానిక గళం

హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గానికే రాకపోవడంతో తమ్ముళ్లు డీలా పడిపోయారు. ఆరు మాసాలకోసారైనా బాలకృష్ణ నియోజకవర్గానికి రావడం లేదని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పార్టీలో ఉన్న కొందరు నేతలు ఈసారి స్థానికులకే టికెట్ ఇవ్వాలని తమ గళం వినిపిస్తున్నారు. స్థానికేతరులను టికెట్ ఇస్తే ఈసారి సహకరించమని ఇప్పటికే అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది.

- రాయదుర్గంలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులుపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆయన స్థానికుడు కాదు, ఇక్కడివారినే అభ్యర్థిగా పెట్టాలని పలువురు అధినాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఓ వైపు పూల నాగరాజు, మరోవైపు దీపక్‌రెడ్డి కాల్వకు టికెట్ ఇవ్వకుండా యత్నిస్తున్నారు. అంతేకాదు, సొంత వాల్మీకి సామాజిక వర్గంలోనే కాల్వ శ్రీనివాసులుపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

ఎస్సీ,ఎస్టీలకు శ్రీవారి దివ్యదర్శనం

- తిరుమలకు బయలుదేరిన 7 గ్రామాల ప్రజలు



అనంత నుంచి బయలుదేరుతున్న భక్తులు

అనంతపురం కల్చరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలకు చెందిన వారికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన 7 గ్రామాలకు చెందిన 327 మంది భక్తులను శ్రీవారి దర్శనానికి పంపించారు. గురువారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపం వద్ద బస్సుల్లో భక్తులను పంపించిన అనంతరం టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమసరతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు శ్రీవారి దివ్యదర్శన భాగ్యం కల్పించామని తెలిపారు. అన్ని వర్గాల వారు శ్రీవారి సన్నిధి చేరుకోవడం సులభతరం కావాలని టీటీడీ తీర్మానించినట్లు పేర్కొన్నారు.

ఏపీ వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా టి.రాజశేఖర్‌రెడ్డి



వజ్రకరూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సలహా మండలి (ఏపీ అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు) సభ్యుడిగా వజ్రకరూరు మండలం కమలపాడుకు చెందిన టి.రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్ 11 జారీ చేసింది. ఈ సలహా మండలికి చైర్మన్‌గా వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. మొత్తం 8 మంది సభ్యులు ఉండగా.. ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన టి.రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. ఈయన ప్రస్తుతం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలిలో సభ్యుడిగా నియమితులైనందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని, రైతుల సంక్షేమానికి, అభ్యున్నతికి పాటుపడుతానని 'సాక్షి'తో టి.రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

జిల్లా ఓటర్లు @ 19,39,163

- పురుష ఓటర్లు 9,67,841
- మహిళలు 9,71,098, థర్డ్ జెండర్ 224
- ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్ నాగలక్ష్మి
- నాలుగు నియోజకవర్గాల్లో మహిళలే అధికం



ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: జిల్లా ఓటర్ల లెక్కతేలింది. మొత్తం ఓటర్ల సంఖ్య 19,39,163 కాగా ఇందులో పురుష ఓటర్లు 9,67,841. మహిళ ఓటర్లు 9,71,098 మంది. థర్‌జెండర్ ఓటర్లు 224 మంది ఉన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను అనుసరించి తుది ఓటర్లు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం విడుదల చేశారు. ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్లలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 3,257 ఎక్కువగా ఉన్నారు. సర్వీసు ఓటర్లు 2,114 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 2,074 మంది, మహిళలు 40 మంది ఉన్నారు.

నాలుగింటిలో మహిళలే అధికం

జిల్లాలోని ఎనిమిది నియోజవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 3,178 మంది అధికంగా ఉన్నారు. అలాగే గుంతకల్లు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 2,319 మంది, ఉరవకొండలో 771 మంది మహిళా ఓటర్లు, రాయదుర్గం నియోజకవర్గంలో 77 మంది మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్నారు.

సర్వీసు ఓటర్లు 2,114 మంది

జిల్లాలో సర్వీసు ఓటర్లు 2,114 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 2,074 మంది, మహిళలు 40 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు రాయదుర్గం నియోకవర్గంలో 60 మంది, ఉరవకొండలో 235, గుంతకల్లులో 417, తాడిపత్రిలో 226, శింగనమలలో 449, అనంతపురంలో 197, కళ్యాణదుర్గంలో 118, రాప్తాడు నియోజకవర్గంలో 412 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయదుర్గం	1,27,279	1,27,356	26	2,54,661
ఉరవకొండ	1,07,342	1,08,113	26	2,15,481
గుంతకల్లు	1,28,980	1,31,299	74	2,60,353
తాడిపత్రి	1,19,864	1,19,329	23	2,39,216
శింగనమల	1,20,060	1,19,275	14	2,39,349
అనంతపురం	1,29,617	1,32,795	44	2,62,456
కళ్యాణదుర్గం	1,11,589	1,10,641	4	2,22,234
రాప్తాడు	1,23,110	1,22,290	13	2,45,413
మొత్తం	9,67,841	9,71,098	224	19,39,163

టీడీపీ కార్యకర్తలపై అట్రాసిటీ కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి ఆ పార్టీకి చెందిన ఆరుగురు కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం టీడీపీ ద్విసభ్య కమిటీ వెంకటాపురంలో పర్యటించింది. ఆ సమయంలో వారి వెంట శింగనమల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి లేకపోవడాన్ని స్థానిక ఎస్సీ కాలనీ వాసులు ఆక్షేపించారు. దీంతో ఘర్షణ చోటు చేసుకుంది. శ్రావణి వర్గానికి చెందిన బంగి రామగోపాల్‌ను కులం పేరుతో దూషిస్తూ ఆదే గ్రామానికి చెందిన కురుబ అక్కులప్ప,బండి మధుసూదన్, లింగమయ్య, బుల్లే పెద్ద అక్కులప్ప, బుల్లే నాగరాజు, డొక్కా శేఖర్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనంత వెంకటరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం



అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: దివంగత అనంత వెంకటరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన 23వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంత కీర్తిని చాటి చెప్పిన మహనీయుడు అనంత వెంకటరెడ్డి అని కొనియాడారు. రాజకీయాల్లో తన కంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుని భవిష్యత్తు రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. జిల్లాలో కరువు నివారణకు ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతపురం జిల్లాకు కృష్ణా జలాలు దక్కాయంటే ఆయన చలవేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతిగా పేరును ఏర్పాటు చేసి ఆయనకు ప్రత్యేక గుర్తింపును అందించిందన్నారు. ఫ్యాక్షన్, గ్రూపు రాజకీయాలకు దూరంగా ప్రజా నాయకుడిగా ఆయన ఎదిన క్రమం అభినందనీయమన్నారు. ఆయన జిల్లాకు నీటిని అందించిన రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. సుదీర్ఘ రాజకీయ నాయకుడిగా ఆయన ఈ జిల్లాకు అందించిన సేవలను కొనియాడారు. నీతి, నిజాయతీతో కూడిన రాజకీయాన్ని చేసి ప్రజలలో ప్రజా నాయకుడిగా ఎదిగారని తెలిపారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీదేవి, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్, నగర అధ్యక్షుడు చింత సోమశేఖర రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, పేరం స్వర్ణలత, మీసాల రంగన్న, పెన్నోబిలేసు, చవ్వా రాజశేఖరరెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, రాధాయాదవ్, సుజాతరెడ్డి, కృష్ణవేణి, క్యాప్టెన్ షెక్షా, ఖాజా, వేముల నదీం, ఆసిఫ్, అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేపరాళ్లలో ఎంఎస్‌ఎంఈ పార్క్

- 126 ఎకరాల స్థలంలో ఏర్పాటు



అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపడుతోంది. ఇందులో భాగంగానే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అండగా నిలిచేందుకు ప్రోత్సాహకాలను సైతం అమలు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాప్తాడు, కప్పలబండ, కొటిపి, ఆర్.అనంతపురం తదితర ప్రాంతాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్‌లను ఏర్పాటు చేసి పారిశ్రామిక వేత్తలకు స్థలాలను సైతం కేటాయించింది. బళ్లారి జిల్లాకు అనువుగా ఉండేందుకు రాయదుర్గం ప్రాంతంలో ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వేపరాళ్ల గ్రామ సమీపంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన కోసం (ఎంఎస్‌ఎంఈ) పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే 126 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఆ స్థలాన్ని చదును చేసే ప్రక్రియను చేపడుతున్నారు. చిన్న పరిశ్రమలతోపాటు పెద్ద పరిశ్రమలకు సైతం స్థలాన్ని కేటాయింపులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అనంతపురం జిల్లాలో మరో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తున్నారు. గుత్తి – గుంతకల్లు ప్రాంతాల మధ్య స్థలాన్ని గుర్తించే పనిలో ఏపీఐఐసీ అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వైటీ చెరువు, రజాపురం గ్రామల మధ్య పరిశ్రమల స్థాపన కోసం అనువైన స్థల సేకరణకు అక్కడి రెవెన్యూ అధికారులతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్‌ను వివరణ కోరగా వేపరాళ్లలో స్థలాన్ని సేకరించామన్నారు. గుత్తి, గుంతకల్లు మధ్య స్థలాన్ని గుర్తించేందుకు అధికారులతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు, మూడు నెలలో వేపరాళ్లలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

డీజీపీతో జీఆర్పీ ఎస్పీ భేటీ



డీజీపీ రాజేంద్రనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గుంతకల్లు రైల్వే జిల్లా ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథరెడ్డిని గుంతకల్లు జిల్లా రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి గురువారం విజయవాడలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జీఆర్పీ స్టేషన్లలో ఖాళీగా ఉన్న వందలాది పోస్టుల భర్తీకి సహకరించాలని విన్నవించారు.

కొనసాగిన రికార్డుల తనిఖీ

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలో చోటు చేసుకున్న అక్రమాలపై మూడో రోజూ గురువారం తనిఖీ కొనసాగింది. పదేళ్ల కాలంలో ఒక్కో ఏడాదికి సంబంధించి పంట సాగు కోసం వెచ్చించిన ఖర్చులు, ఆదాయం, ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆడిటర్లు యోగానందారెడ్డి, మాధవి, రాంబాబు, అన్నపూర్ణ పరిశీలిస్తున్నారు.

ధర్మవరం కుడికాలువకు నీటి విడుదల

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు గురువారం నీటిని విడుదల చేశారు. తొలిరోజు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. కలగళ్ల, మరుట్ల, పి.నాగిరెడ్డిపల్లి, జల్లిపల్లి, ఉదిరిపికొండ, రాప్తాడు నియోజక వర్గ రైతులు బోర్ల కింద సాగు చేసిన పంటలు నీటి కొరత కారణంగా దెబ్బతింటున్నట్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్న నేపథ్యంలో భూగర్భ జలాలు వృద్ధి చెందేలా 100 క్యూసెక్కుల లోపు నీటి సరఫరాకి చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

కారు అపహరణ

సోమందేపల్లి: స్థానిక మణికంఠ కాలనీ సమీపంలోని ఓ ధాబా వద్ద నిలిపిన ఇన్నోవా కారు (ఏపీ 39–టీహెచ్–6917)ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. తన కారును ధాబా ఎదుట యజమాని రామయ్య బుధవారం రాత్రి నిలిపి, ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం ధాబాకు చేరుకుని చూడగా కారు కనిపించలేదు. దీంతో కారును అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్కా.. అమ్మానాన్నను బాగా చూసుకో

- జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థి ఆత్మహత్య
- వర్సిటీ భవనంపైనుంచి దూకిన వైనం

నాన్న రియల్లీ సారీ.. నిన్ను సంతోషపెట్టలేకపోయాను. టెన్త్, ఇంటర్‌లో... ఎప్పుడూ మీకు హ్యాపీ ఫీలింగ్ ఇవ్వలేకపోయా. డబ్బులు అన్నీ వేస్ట్ చేశా. అయినా కూడా నన్ను అంత బాగా చూసుకున్నారు. ఏం అడిగినా కాదనలేదు... సారీ అమ్మా నీ కష్టాన్ని వేస్ట్ చేస్తున్నందుకు.

అక్కా నువ్వు నాకోసం ఎంతో త్యాగం చేశావు. నేను మాత్రం నీకు ఏమీ ఇవ్వలేకపోయాను. నీ మ్యారేజ్‌కి చాలా మంచి బహుమతి ఇద్దామనుకున్నా..కానీ సారీ.. అమ్మా, నాన్నను బాగా చూసుకో

బై.. ఫ్రెండ్స్ ఇంక మిమ్మల్ని కలవను.

ఇలా తల్లిదండ్రులకు, సోదరికి, తన రూమ్మేట్స్‌కు టెక్స్ మెసేజ్ పంపిన ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ వర్సిటీ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం అనంతపురం జేఎన్‌టీయూ క్యాంపస్‌లో చోటుచేసుకుంది.

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన రమణారెడ్డి, విజయ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె గీతారెడ్డి హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్‌ఐటీలో చదువుతోంది. కుమారుడు చాణిక్య నందరెడ్డి (19) అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కేంపస్‌లో బీటెక్ (ఈసీఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిభ గల విద్యార్థిగా గుర్తింపుపొందిన చాణిక్య నందరెడ్డి అధ్యాపకులతో చాలా చనువుగా మసలేవాడు. తోటి విద్యార్థులతో కలిసి ఎల్లోరా హాస్టల్ భవనంలోని రూంలో ఉండేవాడు. రూమ్‌మేట్స్, అధ్యాపకులతో తప్ప మిగతా వారెవరితో కూడా పెద్దగా మాట్లాడేవాడుకాదు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 12 గంటల దాకా స్నేహితులతో కబుర్లు చెప్పాడు. గురువారం తెల్లవారుజాము 5.40 సమయంలో తన గదిలోని మిత్రులకు బై అంటూ సెల్‌ఫోన్‌లో సందేశం పంపి క్షణాల వ్యవధిలోనే కంప్యూటర్ సెంటర్ మేడపైనుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులు వెళ్లి చూశారు. రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని చూసి ఆందోళన చెందారు. చాణిక్య గదిలో ఉంటున్న విద్యార్థులు దుస్తులు చూసి అతన్ని గుర్తించారు. వార్డెన్ ద్వారా విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ సుజాత వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసు మృతదేహాన్ని పరిశీలించారు. చాణిక్య భవనం పైనుంచి బోర్లా పడటంతో ముఖం పూర్తిగా ఛిద్రమైందని, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావమై శరీరంలోని ఎముకలు సైతం విరిగిపోయాయని గుర్తించారు. హాస్టల్ గదిలో ఉంటున్న విద్యార్థులతో విచారించారు. సెల్‌ఫోన్‌లకు పంపిన సందేశాన్ని పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. 'నా చావుకు సీనియర్లు, జూనియర్లు ఎవరూ కారకులు కాదు' అని టైప్ చేసి పెట్టుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు.



భవనంపై నుంచి కిందకు దూకి మృతి చెందిన చాణిక్య నందరెడ్డి

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

చాణిక్య నందరెడ్డి ఆత్మహత్య గురించి తెలుసుకున్న రమణారెడ్డి, విజయ దంపతులు వెంటనే అనంతపురం చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న బిడ్డను చూసి గుండెలవిసేలా రోదించారు. ఉదయం తన ఫోన్‌కు సారీ నాన్న...అమ్మ అని సందేశం పంపాడని, నిద్రలేచి చూసుకునేలోపు ఇక్కడి విద్యార్థులు ఫోన్‌లు చేశారని చెప్పారంటూ విలపించారు. తన సోదరి హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్తుండటంతో ఆమెను పలకరించేందుకు డిసెంబరు 24న ఉదయగిరికి వచ్చాడని, మూడు రోజులు తమతో సంతోషంగా గడిపాడని వారు తెలిపారు. రూ.60 వేలు స్కాలర్‌షిప్ వస్తే తన ఖాతాకే బదిలీ చేశాడని తండ్రి గుర్తు చేసుకున్నారు. తమకు అండగా ఉంటాడనుకున్న బిడ్డను భగవంతుడు ఇలా తీసుకుపోయాడంటూ వారు విలపించిన తీరు స్థానికులను కన్నీళ్లు పెట్టించింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్ బాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజం

అనంతపురం సప్తగిరి సర్కిల్: దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్‌గా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పామిడి వీరాంజనేయులుతో స్థానిక జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాదదర్శక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. దీంతో తప్పుడు సంకేతాలతో ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిగా చంద్రబాబు అనుసరించాల్సిన వ్యూహం ఇది కాదన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలకు చేసిన మంచిని వివరించి, ప్రజాక్షేత్రంలో పోటీకి నిలబడాలన్నారు. ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తీసుకొచ్చారన్నారు. నేడు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అమ్మ ఒడి, చేయూత, చేదోడు, నేతన్న నేస్తం, విద్యా కానుక, గోరుముద్ద.. తదితర ఎన్నో పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల్లో హృదయాల్లో సీఎం వైఎస్ జగన్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అది చీకటి జీఓ కాదు

ప్రజాసంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించకూడదంటూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓను 'చీకటి జీఓ'గా అభివర్ణించడం టీడీపీ నేతల తెలివితక్కువ తనానికి నిదర్శనమన్నారు. టీడీపీ దుష్ట చతుష్టయం బారి నుంచి ప్రజలను కాపాడేందుకే ఆ జీఓను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. తన పబ్లిసిటీ పిచ్చితో ఒకప్పుడు గోదావరి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలను సీఎం హోదాలో చంద్రబాబు బలిగొన్నారని గుర్తు చేశారు. తాజాగా నెల్లూరు జిల్లా కందుకూరులో 8 మందిని, గుంటూరులో ముగ్గురిని బలిగొన్నారన్నారు. తన పప్పు కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం ప్రజల ప్రాణాలను హరించాలనుకోవడం దారుణమన్నారు. ఈ తప్పులను కప్పిపుచ్చుతూ ఆయనకు అనుకూల మీడియా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. వీరి కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రారంభమైన క్రీడాపోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, పీడీ గణేష్, లెక్చరర్ రంగనాయకులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- జీటీపీలో మృతదేహం లభ్యం



మృతుడు బాలరాజు

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం తిప్పయ్యదొడ్డి గ్రామానికి చెందిన బాలరాజు(28)కు శెట్టూరు నివాసి శిల్పతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. కర్ణాటకలోని రెడ్లపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి స్ప్రింక్లర్లను తీసుకువస్తానంటూ ఇంట్లో చెప్పి బుధవారం ఉదయం తన దాయాది ముక్కన్నతో కలసి ద్విచక్ర వాహనంపై బాలరాజు వెళ్లాడు. రాత్రి ముక్కన్న ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. బాలరాజు కోసం కుటుంబసభ్యులు ఆరా తీస్తే సరైన సమాధానం ఇవ్వలేదు. గురువారం ఉదయం 9 గంటలకు భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని బాలరాజుగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. మద్యం మత్తులో తమ కుమారుడిని ముక్కన్ననే హతమార్చి బీటీపీలోకి పడేసి ఉంటాడని బాలరాజు తండ్రి తిప్పేస్వామి అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, గతంలో ముక్కన్నపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేపట్టారు.

పరిశ్రమలపై రాజకీయ బురద చల్లొద్దు

తాడిపత్రి: ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలపై రాజకీయ బురద చల్లడం సరికాదని రాయలచెరువు, యాడికి మండలాలకు చెందిన ఎండీఎల్ పరిశ్రమల యజమానులన్నారు. గురువారం రాత్రి తాడిపత్రిలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించకపోవడంతో ఆ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు 12 పౌడర్ మిల్లులు, క్రషర్ పరిశ్రమలకూ మూత వేయించారన్నారు. ఈ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి గ్రామపెద్ద వి.రమణారెడ్డితో కలసి పరిశ్రమల యజమానులు తీసుకెళ్లి కొన్ని సడలింపులతో పరిశ్రమలు తెరుచుకునే అవకాశం కల్పించాలని విన్నవించారని గుర్తు చేశారు. ఆ దిశగా ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలను తప్పుబడుతూ టీడీపీ చెందిన కొందరు వారికి అనుకూలమైన పత్రికలో అసత్య కథనాలు ప్రచురించి, రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఎలాంటి తప్పు చేయని వారు సైతం వారి పరిశ్రమలను మూత వేసుకున్న పరిస్థితి ఉందన్నారు. ఎందరికో జీవనోపాధి కల్పిస్తున్న పరిశ్రమలను మూత వేయించడమంటే పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకున్నట్లవుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రాజకీయాలకు తావివ్వకుండా పరిశ్రమల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎండీఎల్ యజమానులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల దాడి



గాయపడిన హాజీ

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త హాజీపై టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. వివరాలు... గుంతకల్లులోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న హాజీ.. గురువారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని, అమీన్‌పల్లికి చెందిన రామాంజనేయులు (టీడీపీ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు)ను కలసి తన పరిస్థితి బాగా లేక రూ.3వేలు బాకీ చెల్లించలేక పోయానని, ఆ సొమ్ము ఇప్పుడు ఇచ్చేందుకు వచ్చానంటూ తెలిపాడు. ఆ సమయంలో రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇన్నేళ్లుగా బాకీ చెల్లించకుండా ఇప్పుడేంది ఇచ్చేది అంటూ దుర్భాషలాడుతూ దాడికి తెగబడ్డాడు. అదే సమయంలో రామాంజనేయులు అనుచరులు పది మంది చుట్టుముట్టి గాజు సీసాలు, బండరాళ్లతో దాడి చేశారు. చుట్టుపక్కల వారు విడిపించేందుకు ప్రయత్నించినా వినకుండా దాదాపు 300 మీటర్ల మేర కొట్టుకుంటూ ఈడ్చుకెళ్లారు. విషయం తెలుసుకున్న అక్కడికి సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జోక్యం చేసుకుని వారి బారి నుంచి హాజీని కాపాడి ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు కర్నూలు సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ సీఐ గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హాజీపై జరిగిన దాడిని తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నేత, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సందీప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, కౌన్సిలర్ లింగన్న, నాయకులు నూర్ నిజామి, గఫార్ ఖాన్, బుల్లెట్ సత్తార్, మహదేవ తదితరులు ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య



శ్రావణి (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న శ్రావణి (26)ని అదే రోడ్డులో ఉంటున్న మేనమామ దుర్గాప్రసాద్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల వయసున్న కుమార్తె ఉంది. దంపతులిద్దరి మధ్య అప్పుడప్పుడు మనస్పర్థలు తలెత్తి గొడవపడేవారు. ఇద్దరికీ కుటుంబ పెద్దలు సర్దిచెప్పేవారు. అయితే దుర్గాప్రసాద్ తీరు సరిగా లేదంటూ పలుమార్లు తన తల్లిదండ్రులకు శ్రావణి చెబుతూ వచ్చింది. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం శ్రావణి గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చి గది తలుపు తీసి చూస్తే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న శ్రావణి మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి అక్కమ్మ, సోదరుడు రాధాకృష్ణ అక్కడకు చేరుకుని శ్రావణి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కనులపండువగా గంధం వేడుకలు

పెనుకొండ: పట్టణంలో బాబయ్య స్వామి రెండో గంధం వేడుకలు గురువారం తెల్లవారుజామున కనులపండువగా జరిగింది. వందలాది భక్తుల నడుమ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సందల్ మహల్ నుంచి గంధాన్ని తలపై తీసుకువచ్చి స్వామి సమాధి వద్ద సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి జనం తరలిరావడంతో పట్టణం జనసందోహంగా మారింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఘనంగా ఉరుసు, దీపారాధన

బాబాయ్య దర్గా ఉత్సవాల్లో భాగంగా ఉరుసు, దీపారాధన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దర్గా ఆవరణలో స్వామి సమాధికి సమీపంలో ఉన్న హోమంలో భక్తులు పెద్దయెత్తున కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పలు కాల్చి దీపాలు వెలిగించారు. చల్లగా చూడాలంటూ బాబయ్య స్వామిని ప్రార్థించారు. మత సామరస్యం కోసం పాటునపడిన పలువురికి బాబయ్య స్వామి దర్గా ఆవరణలో రాత్రి పురస్కారాలను అందజేశారు.



గంధాన్ని తీసుకెళ్తున్న పీఠాధిపతి తాజ్‌బాబా, ఆయన కుమారుడు నజర్‌హుస్సేన్

- **బుల్లి విమానం చక్కర్లు**



కళ్యాణదుర్గం: భూమికి అతి చేరువగా ఓ బుల్లి విమానం (208 కార్వాన్) చక్కర్లు కొట్టి గ్రామీణుల్లో ఉత్కంఠకు తెరలేపింది. వివరాలు.. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి, గోళ్ల, శీబావి, బెళుగుప్ప, హనిమిరెడ్డి పల్లి, జీడిపల్లి రిజర్వాయర్ ప్రాంతాల్లో విమానం చక్కర్లు కొట్టింది. తొలుత సాంకేతిక లోపం తలెత్తిందేమోనని ప్రజలు భావించారు. అయితే పలుమార్లు చక్కర్లు కొట్టడంతో ప్రైవేట్ కంపెనీలేమైనా సర్వే చేపట్టాయా? లేదా, ప్రభుత్వమే సర్వే చేస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా మీదుగా భారీగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని అనంతపురం సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను అనంతపురం సెబ్ సీఐ రవిచంద్ర గురువారం వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం అనంతపురంలోని తపోవనం సర్కిల్‌లో సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో టమాట తరలిస్తూ అటుగా వచ్చిన బొలెరో పికప్ వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో 100 బాక్కుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు లోతైన దర్యాప్తు చేపట్టి కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున గౌడ్, బోయ రాజశేఖర్, రాంపల్లి నివాసి రమేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులు కర్ణాటకలోని నాగలమడక నుంచి 9,216 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని మారెళ్ల గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బంగారు గొలుసు అపహరణ

పెద్దవడుగూరు: మహిళ దృష్టి ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసులో సగానికి పైగా దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం కాశేపల్లికి చెందిన సుహాసిని స్థానిక 44వ జాతీయ రహదారి పక్కనే ధాబా నిర్వహిస్తూ, అందులోనే కుటుంబసభ్యులతో కలసి నివాసముంటోంది. గురువారం తెల్లవారుజామున 5.20 గంటలకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు తమకు టీ కావాలని అడిగారు. టీ ఇచ్చేందుకు ఫ్లాస్క్‌పై ఆమె దృష్టిసారించిన క్రమంలో ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాగాడు. వెంటనే అప్రమత్తమైన సుహాసిని గొలుసు పట్టుకుని, కేకలు వేసింది. ఈ లోపు ఆమె చేతిలోని చైన్ సగానికి పైగా తెంపుకుని సహచరుడితో కలసి ద్విచక్ర వాహనంపై దుండగుడు ఉడాయించాడు. దాదాపు 13 గ్రాముల బంగారు చైన్ దుండగులు లాక్కెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పెద్దవడుగూరు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరువలేమన్నారు. జిల్లా పరిషత్, అనుబంధ శాఖల్లో పనిచేస్తూ మృతి చెందిన ఆరుగురు ఉద్యోగుల కుటుంబసభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను గురువారం సంబంధీకులకు గిరిజమ్మ అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు అందుకున్న వారిలో తలుపుల ఎంపీడీఓ కార్యాలయానికి బాబా, నల్లమాడ హైస్కూల్‌కు మూడే తేజస్విని, కళ్యాణదుర్గం మండలపరిషత్‌కు గాజుల శ్రీకాంత్, జిల్లా పరిషత్ కార్యాలయానికి బెస్త ప్రవీణ్‌కుమార్, పరిగి మండల పరిషత్‌కు బి.తులసి, రాయదుర్గం మండల పరిషత్‌కు ఎస్.కవిత ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లెక్కల శ్రీనివాసులు, రఫీ, ఎ–సెక్షన్ పరిపాలనాధికారి నాగేంద్రకుమార్, జూనియర్ అసిస్టెంట్ రఘురాం పాల్గొన్నారు.

27 నుంచి 'బాలోత్సవ్'

అనంతపురం కల్చరల్: ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు సాగే 'బాలోత్సవ్' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఇన్‌చార్జ్ డీఈఓ వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రాంగణంలో బాలోత్సవ్ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బాలోత్సవ్‌లో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా కృషి చేస్తామన్నారు. బాలోత్సవ్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు జిలాన్, రమణయ్య, రియాజుద్దీన్, సురేష్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడామైదానం వేదికగా లాలీగా సహకారంతో ఆర్డీటీ, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 16 బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో గోవాకు చెందిన కంపాషన్, వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్, చెన్నైకు చెందిన తడం, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్లు గెలుపొందాయి.

- తొలి మ్యాచ్‌లో జార్ఖండ్‌కు చెందిన యువ జట్టుపై 1–0 గోల్స్ తేడాతో కంపాషన్ జట్టు విజయం సాధించింది. జట్టులో పెర్ల్ ఫెర్నాండేజ్ గోల్ సాధించింది.
- రెండో మ్యాచ్‌లో చెన్నైకు చెందిన లైఫ్ స్పోర్ట్స్ అకాడమీ జట్టుపై 17–0 గోల్స్ తేడాతో వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. జట్టులో అరుణ 11, శాంతి 2, రామలక్ష్మి, రేష్మా, అనురాధ చెరో గోల్ సాధించారు.
- మూడో మ్యాచ్‌లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టుపై చెన్నైకు చెందిన తడం జట్టు 3–0 గోల్స్ తేడాతో గెలుపొందింది. జట్టులో శుభశ్రీ 3 గోల్స్ సాధించింది.
- నాల్గో మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టుపై 2–1 గోల్స్ తేడాతో అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు విజయం సాధించింది.
- ఐదో మ్యాచ్‌లో చెన్నైకు చెందిన లైఫ్ స్పోర్ట్స్ అకాడమీ జట్టుపై కంపాషన్ జట్టు 16–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. జట్టులో ఫాతిమా 7, పెర్ల్ ఫెర్నాండేజ్ 6, ఆమీ 3 గోల్స్ చేశారు.

క్లుప్తంగా

నేడు 47వ డివిజన్‌లో 'గడప గడపకూ'

అనంతపురం క్రైం: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం 47వ డివిజన్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని 4వ రోడ్డు సోమనాథ్ నగర్ బ్రిడ్జ్ వద్ద ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సంగం శ్రీనివాసులు తెలిపారు. వివిధ విభాగాల అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సమావేశానికి హాజరుకావాలన్నారు.

ముట్టాల రైతులతో సమావేశం

ఆత్మకూరు: మండలంలోని ముట్టాలకు చెందిన రైతులతో సోలార్ పార్క్ ఏర్పాటు కోసం గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. రైతులతో మాట్లాడుతూ మండలంలో సోలార్‌కు భూములు ఇచ్చే రైతులు ఇష్టపూర్వకంగానే ఇవ్వాలని, ఏడాదికి ఎకరానికి రూ.30 వేల నగదు ఇస్తామన్నారు. ఏడాదికి రూ.1,500 పెంచుతూ, దాదాపు 30 ఏళ్లపాటు అగ్రిమెంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను చెల్లింపులు వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. గురువారం ఉదయం రాంనగర్‌లోని 54 సచివాలయం ఆవరణంలో 15 బృందాలు, సాయంత్రం నవోదయ కాలనీలోని 41వ సచివాలయంలో 25 బృందాలతో అదనపు కమిషనర్ సమావేశం నిర్వహించారు. బృందాలుగా, వ్యక్తిగతంగా వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నులు జాప్యం చేసే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

8న సాధన నవల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రముఖ రచయిత వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ రచించిన 'సాధన' నవల ఆవిష్కరణ ఈనెల 8న జరుగనుంది. ఈ మేరకు గురువారం శాంతినారాయణ ఆ వివరాలు తెలియజేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక జెడ్పీ సమావేశ భవన్‌లో జరగనున్న సాహితీ కార్యక్రమానికి సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి ఆత్మీయ అతిథిగా రానున్నారన్నారు.

తనిఖీలు ముమ్మరం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం రాత్రి ఏక కాలంలో పోలీసులు రహదారులపైకి వచ్చారు. బహిరంగ స్థలాల్లో మద్యం తాగే వారితో పాటు అక్రమ రవాణా, వాహనాల తనిఖీలు చేశారు. లైసెన్స్, రికార్డులు లేకుండా వాహనాలు నడిపేవారిపై జరిమానా విధించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టినట్లు నగర ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు.

ఆదర్శప్రాయుడు అనంత వెంకటరెడ్డి



ఆస్పత్రిలో ఫ్యాన్లు అందిస్తున్న అనంత చంద్రారెడ్డి, రమేష్ గౌడ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత వెంకటరెడ్డి ఆదర్శప్రాయుడు అని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. అనంత వెంకటరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి అవసరమైన పరికరాలను వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి చేతులమీదుగా సూపరింటెండెంట్ రఘునందన్‌కు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసగిరి నాగ్ రాయల్, సుకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మా..నేను మీ బిడ్డలాంటి వాడినే.. సమస్యలు తెలుసుకునేందుకు వచ్చాను.. ఏకష్టమొచ్చినా నాతో చెప్పండి.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తా' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వృద్ధులు, మహిళలు, ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ గడప గడపకూ ముందుకు సాగారు. మా ఇంటి సభ్యులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో మూడు, నాలుగు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఎదుట స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. నవరత్నాలు తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని తెలియజేశారు.

గాండ్లపర్తికి చెందిన గీతక్క అనే మహిళ కుటుంబానికి మూడేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.5లక్షల దాకా లబ్ధి చేకూరింది. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.40,500, వైఎస్సార్ వాహనమిత్ర కింద రూ.30 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) కింద రూ.5,074, జగనన్న అమ్మఒడి కింద రూ.42 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.20,346, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) కింద రూ.4,979, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.3,769, ఇంటి స్థలం రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్ష లబ్ధి జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చదివి వినిపించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా ప్రజల సంక్షేమం కోసమేనని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మన తన తారతమ్య బేధాలు లేకుండా పార్టీలు, కులాలాలకు అతీతంగా ప్రతి పథకం వలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ చేకూరుతున్నాయన్నారు. సంక్షేమం తమ ప్రభుత్వ పథమని, ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. మూడేళ్లలో చేసిన అభివృద్ధిని తెలుసుకునేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం పేరిట ప్రతి ఇంటికీ తిరుగుతున్నామన్నారు. గాండ్లపర్తి గ్రామంలో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలకరించారు.

రూ.2 లక్షలు ఆర్థిక సాయం

ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులున్న గ్రామస్తులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రూ.2లక్షలు అందించారు. నడవలేని వృద్ధుడు గవ్వల మల్లేష్‌కు ఎమ్మెల్యే సొంత నిధులతో ట్రైసైకిల్ అందించారు. అనంతరం ఎమ్మెల్యే జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, నాణ్యతగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, ట్రాన్స్‌కో ఏఈ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూస్సీరాణి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, స్థానిక నాయకులు డొక్కా రామచంద్ర, విజయ శంకర్, చిన్నకృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపాల్ రెడ్డి పాల్గొన్నారు.



గాండ్లపర్తిలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంత వెంకటరెడ్డి సేవలు మరువలేనివి





అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అనంత, పైలా, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్, రాగే పరుశురాం, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



బాలసదన్‌లోని వాషింగ్ మిషన్ అందజేస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత

బుక్కరాయసముద్రం: మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి జిల్లాకు చేసిన సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రోటరీపురంలో ఉన్న అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తన సోదరులు సుబ్బారెడ్డి, చంద్రారెడ్డితో కలిసి తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు సాగు, తాగు నీరు తీసుకురావడానికి అనంత వెంకటరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అనంత వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ బాషా, ఆలూరు రమణారెడ్డి, బీకేఎస్ సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, పెన్నోబిలేసు, సత్యనారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఆధ్వర్యంలో .. కోవూరు నగర్‌లోని శిశుగృహ, బాలసదన్‌లో చిన్నారులకు వాషింగ్ మెషీన్, దుస్తులు అందించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు హాజరయ్యారు. లక్ష్మీనగర్‌లో ఉన్న అనాథల ఆశ్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

యువ నాయకత్వం దేశానికి అవసరం



యువతకు శిక్షణ కిట్లు అందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కల్చరల్: దేశానికి యువ నాయకత్వం అత్యవసరమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. గురువారం నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో 'యువత- నాయకత్వ లక్షణాలు' అనే అంశంపై మూడు రోజుల పాటూ సాగే శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్‌వైకే సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటంతో పాటు పోలీసు ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఎన్‌వైకే అధికారులు సందీప్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్సార్ ఎడుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

డ్రోన్ సర్వేపై కసరత్తు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులు డ్రోన్ సర్వేపై కసరత్తు ప్రారంభించారు. గతేడాది సెప్టెంబర్‌లో భూ హక్కుదారులకు శాశ్వత భూహక్కు పత్రాన్ని డేటాబేస్ డిజిటలైజ్‌డ్ రూపంలో ప్రభుత్వం అందించేందుకు రీసర్వేకు శ్రీకారం చుట్టింది. రీసర్వేలో భాగంగా ఎరోడైన్ ఏజెన్సీ బృందం ఓంకార్, విజయ్, దత్తా తదితరులు నగరపాలక సంస్థలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ2) సువర్ణను గురువారం కలిశారు. సర్వేలో బృందం సభ్యులు చేపట్టే సర్వేను అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ- 2 సువర్ణకు వేర్వేరుగా తెలియజేశారు. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 35 గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్ (జీపీ)లను తీసుకొని, తర్వాత డ్రోన్ ఫ్లై చేస్తామన్నారు. ట్రయల్ రన్‌లో భాగంగా ఆర్‌టీఏ కార్యాలయం, పాత ఆర్‌టీఏ కార్యాలయం, నగరపాలక సంస్థ, వేణుగోపాల్ నగర్ తదితర ప్రాంతాల్లో గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్లను బృందం సభ్యులు పరిశీలించారు. శుక్రవారం నుంచి డ్రోన్ సర్వేకు చర్యలు తీసుకుంటారు. సర్వేయర్ ప్రభాకర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అంజలి, మురళీ, పట్టణ ప్రణాళిక కార్యదర్శి పాల్గున, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక పోలీసు కాంప్లెక్స్‌లోని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యంలో జరిగిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈనెల 5 నుంచి 13 వరకు సాగే ప్రదర్శనను గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎల్ఎం మోహనరెడ్డి, డీఈవో వెంకటకృష్ణారెడ్డి, ఆర్డీవో మధుసూదనరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తదితరులు హాజరై మాట్లాడారు. వేణుగోపాల్, శ్రీదేవి, రాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.ఎం బాషా, రవిచంద్ర పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు జిల్లా క్రీడాకారుడు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అంతర్జాతీయ ఖోఖో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు కుళ్లాయిరెడ్డి ఎంపికయ్యాడు. స్టూడెంట్ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కట్టకిందపల్లికి చెందిన కుళ్లాయిరెడ్డి ఎంపికయ్యాడు. క్రీడాకారుడు స్థానిక జ్ఞానసరస్వతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 10 నుంచి 14 వరకు నేపాల్‌లోని ఖాట్మాండులో జరగనున్న అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి పాల్గొననున్నాడు.

సమగ్ర విచారణ చేయించాలి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో బీటెక్ విద్యార్థి చైతన్య నందారెడ్డి హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, పీడీఎస్‌యూ పట్టణాధ్యక్షుడు బండారు శంకర్ డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల భవనం వద్ద వారు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ సీసీ కెమెరాలు రాత్రి 10 గంటల వరకు పనిచేశాయని అధికారులు చెప్తున్నారన్నారు. అప్పటి నుంచి ఉదయం విద్యార్థి ఆత్మహత్య చేసుకునే వరకు సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయాయని పేర్కొనడం అనుమానాలకు తావిస్తోందన్నారు.


నగర వీధుల్లో శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: పరమహంస యోగానంద 129వ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగరవీధుల్లో సద్గురువులు చిత్రపటాన్ని ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన పల్లకీలో ఊరేగించారు. సంస్థ ప్రతినిధి నరసింహులు నేతృత్వంలో టవర్‌క్లాక్ వద్ద యోగదా సత్సంగమండలి సభ్యులు శాంతి నినాదాలు చేసి, గురువులను కీర్తించారు. అనంతరం ఆదిమూర్తి నగర్‌లోని యోగదా సత్సంగ మండలి ప్రాంగణంలో సామూహిక భజనలు, ధ్యానం చేశారు.

ఖాజానగర్‌లో ఆక్రమణల తొలగింపు

అనంతపురం క్రైం: నగరంలోని ఖాజానగర్‌లో కాలువలపై ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. గురువారం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సువర్ణ, ఎస్ఈ నాగమోహన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజలి బృందం ఖాజానగర్‌లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉండే సుజాత అనే మహిళ పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించారు. రెండు అడుగులు తొలగించి, కాలువ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి అభినందనలు



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

అనంతపురం: వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎమ్మెల్సీ టి. కల్పలతా రెడ్డి నియామకంపై వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబుళపతి హర్షం వ్యక్తం చేశారు. గురువారం విజయవాడలో కల్పలతారెడ్డిని కలిసి సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేస్తున్న కల్పలతా రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌టీఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హెచ్.గిరిధర్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రం పెనుకొండ బాబా ఫక్రుద్దీన్ (బాబయ్య స్వామి) దర్గాలో నగర మేయర్ వసీం , జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామికి ప్రత్యేక చాదర్‌ను సమర్పించారు. అనంతరం దర్గా పీఠాధిపతుల వంశస్తులు వారిని సన్మానించారు. అనంతరం మేయర్ తదితరులు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పెనుకొండ దర్గాలో ఏటా ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహమ్మద్ ఇసాక్ మదిని బాషా, బాబాఫక్రుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్, శర్మాస్‌వలి తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మేయర్ వసీం , జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

ఎమ్మెల్యే 'అనంత'ను కలిసిన సీఐడీ పీపీ

అనంతపురం సిటీ: అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని సీఐడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పూజారి రాజశేఖర్ గురువారం కలిశారు. జిల్లా కోర్టు పీపీ హరినాథరెడ్డి, అడిషనల్ పీపీలు రాజశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, నారపరెడ్డి, విద్యాపతి, నాగరాజుతో కలసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా జారీ చేసిన నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యేకు చూపించారు. రాజశేఖర్ స్థానిక కోర్టులో 2009 నుంచి 2016 వరకు అడిషనల్ పీపీగా పని చేశారు. ప్రాసిక్యూషన్ (పోలీస్) పక్షాన వందలాది కేసులు వాదించి, గుర్తింపు పొందారు. అందులో కొన్ని సంచలన కేసులు కూడా ఉన్నాయి. బాధితులకు పరిహారం ఇప్పించడంలోనూ సఫలీకృతులయ్యారు. కర్నూలు సీఐడీ అధికారులు తన పేరును ప్రభుత్వానికి ప్రతిపాదించగా, తనను నియమించినట్లు ఈ సందర్భంగా రాజశేఖర్ తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి వర్కర్ల హంగామా

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే బాషా, ధను అనే ఇద్దరు వర్కర్లు హంగామా చేశారు. బెట్టింగ్ డబ్బుల విషయంలో వాదులాడుకున్నారు. ఆ ఇద్దరిలో ధను అనే వ్యక్తి భార్య ఏకంగా డయల్ 100కు ఫిర్యాదు చేసి, సార్..మా ఆయన్ని బెట్టింగ్ డబ్బులు కట్టాలని వేధిస్తున్నారని తెలిపింది. రంగంలోకి దిగిన పోలీసులు..ఘటనపై మహిళను ఆరా తీశారు. నాభర్త నాజీతం డబ్బులు మొత్తం తీసుకెళ్లి వీరితో కలిసి ఖర్చు చేస్తున్నాడని, డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో నా భర్తతో కలిసి పనిచేసే బాషా అనే యువకుడు నాపై దాడికి వచ్చాడని వాపోయింది. ఇప్పటికే సర్వం కోల్పోయామని చెప్పింది. పోలీసుల ముందే బాషా అనే యువకుడు నీ భర్తను కొట్టింది మాత్రం నిజం.. ఈమెను ఏమీ అనలేదు.. సర్దుకుపోతామని చెప్పడంతో పోలీసు కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోవడం గమనార్హం.

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పరికరాల వితరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఆర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 12 లక్షల విలువ చేసే పరికరాలను అందించారు. గురువారం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌కు కంపెనీ ప్రతినిధులు ఆర్జాస్ స్టీల్ హెడ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ రాం, సాంబశివారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ అనంత్, రవిప్రకాష్, బ్రహ్మానందం, రంగస్వామి, ఆర్ఎంఓ వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీఎస్పీగా మహబూబ్‌బాషా

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర ఇన్‌చార్జ్ డీఎస్పీగా సీసీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి ఈ నెల 16 వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబ్‌బాషాకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటాం

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటామని కంటిశస్త్రచికిత్సలు చేయించుకున్న వారు తెలియజేశారు. నెల రోజుల క్రితం నుంచి బెంగళూరు శంకరఆస్పత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా కంటి పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు కూడా చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయించుకున్న 25 మంది బాధితులకు ఉచితంగా కంటి అద్దాలు అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలున్నవారికి శస్త్రచికిత్సలు చేయించి, అద్దాలు అందించినట్లు తెలిపారు.

బస్సు సర్వీస్ వేళలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

అనంతపురం క్రైం: బస్సు సర్వీస్ వేళలు పాటించాలని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేశారు. కళ్యాణదుర్గం బస్సులు సమయానికి నడపడంలేదని, ప్రయాణికులు కార్యాలయంలో ఉన్న జోనల్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె బస్టాండ్‌కు చేరుకొని కళ్యాణదుర్గం సర్వీస్ బస్సు డ్రైవర్లపై అసహనం వ్యక్తం చేశారు. సమయపాలనతో బస్సులు తిప్పేలా చూడాలని కళ్యాణదుర్గం డిపో అధికారులను ఆమె ఆదేశించారు. వివిధ బస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్టేషన్ మేనేజర్ కేఎస్ మూర్తిని ఆదేశించారు. జోనల్ చైర్‌పర్సన్ వెంట సూపరింటెండెంట్ అవధాని శ్రీపాద తదితరులు ఉన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

ఆత్మకూరు: పిల్లల ఆరోగ్య విషయాలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. గురువారం మండలంలోని పి.యాలేరులో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పుట్టకతో వచ్చిన లోపాలు, రక్తహీనత గుర్తించడానికి 24 మంది పిల్లలకు పరీక్షలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారాన్ని పరీక్షించి, సూచనలు,సలహాలు పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వామి, ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, ఏఎన్ఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఆలయంలో చోరీకి పాల్పడిన ఓ దొంగను త్రీటౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. దొంగ నుంచి కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దొంగ ధర్మవరానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ఆలయాలను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇతనిపై శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో రెండు చోరీ కేసులు, ధర్మవరంలో రెండు కేసులు ఉన్నట్లు తెలిసింది.